ఉపాధి వైపు కూలీల చూపు

- ఏప్రిల్ నుంచి వంద రోజుల ఉపాధి అవకాశం
- మండలంలో 12388 జాబ్ కార్డులు
- వేసవిలో పెరుగుతున్న కూలీలు
- ఉపాధి పనిలో రోజు 2500 లకు కూలీలు



కందకాలు తవ్వుతున్న కూలీలు

దామరగిద్ద: కూలీలకు వ్యవసాయ పనులు లభించని సమయంలో ఒక కుటుంబానికి కనీసం వంద రోజులపాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకంలో ఉపాధి పొందేందుకు స్వల్పకాల ఉపాధికోసం కూలీలు ఉపాధివైపు చూస్తున్నారు. మండలంలో మొత్తం 12388కుటుంబాలు జాబ్‌కార్డులు కల్గి ఉన్నారు. వీరిలో ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న జాబ్‌కార్డులు కల్గినవారు 8వేలకు పైగా ఉన్నారు. ప్రస్తుతం రోజుకు 2500మందికి పైగా వివిధ పనులకు వెళ్తూ ఉపాధి పొందుతున్నారు. గత మార్చి 31 నాటికి 68కుటుంబాలు వందరోజులు పని దినాలను పూర్తి చేసుకోవడంతో ఏప్రిల్ నుంచి తిరిగి కొత్తగా వంద రోజులు పనిదినాలను పొందడంతో ఉపాధి పనికి తిరిగి వెళ్తున్నారు. ప్రభుత్వం పథకం అమలులో గతంలో వేసవి కాలంలో ఉపాధికూలీతోపాటు అలవెన్సులను అదనంగా ఇచ్చేది. కాగా గత కొన్ని సంవత్సరాలు ప్రత్యేక అలవెన్సులను తొలగించి ఉపాధి కూలీని ఏడాది పొడవుగా పెంచుతు రోజు కూలీని 300కు పెంచినట్లు అధికారులు చెప్పుకోస్తున్నారు. గ్రామ పంచాయతీ ద్వారా టెంట్‌లు, తాగునీరు, ప్రథమ చికిత్స బాక్స్‌వంటివి సమకూర్చే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. కాగా ఎలాంటి వేసవి సదుపాయాలు కల్పించడం లేదు.

ఉపాధిహామీలో చేపడుతున్న పనులు

మండలంలోని వివిధ గ్రామాల్లోని ఉపాధి కల్పించేందుకు ఆయా గ్రామాల్లో ఫాం పండ్స్, ఫీడర్ చానల్స్, మట్టిరోడ్లు, చెరువుల పూడికతీత, కందకాలు, వాలు కట్టల నిర్మాణం వంటి వ్యవసాయ అనుబంధ పనులను చేపడుతున్నారు. పనిచేసిన కూలీలకు గత ఫిబ్రవరి 17వరకు కూలీ డబ్బులను ప్రభుత్వం విడుదల చేసిందని పోస్టాఫీసు ఖాతాల నుంచి పోస్టల్ అధికారులు కూలీ డబ్బులు అందిస్తున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు.

వందరోజులు పనికి వెళ్లిన..



వ్యవసాయ పనిలేని సమయంలో ఉపాధి హామీ పనికి వెళ్లిన మొన్నటి వరకు వంద రోజులు పూర్తి అయింది. తిరిగి ఏప్రిల్ నుంచి మళ్లీ పనిచేసుకునే అవకాశం లభించింది. ప్రభుత్వం పనిదినాలను వందరోజుల నుంచి 200 రోజులకు పెంచితే బాగుంటుంది.

-వెంకటయ్యగౌడ్, కందెన్‌పల్లి

కూలీలను పెంచేందుకు చర్యలు



ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా ఉపాధి అవకాశాన్ని కల్పిస్తుంది. వందరోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలతో పాటు మిగిలిన కుటుంబాలు వందరోజులు పనిని ఉపయోగించుకునేలా కూలీలను పెంచేలా చర్యలు తీసుకుంటాం. జాబ్ కార్డు దారులను ఉపాధి పనికి వచ్చేలా చూడాలి. వేసవి ఎండల సరంక్షణకు టెంట్‌లు, తాగునీరు ప్రథమ చికిత్స బాక్స్‌లు ఏర్పాటుచేసుకోవాలని తెలియజేస్తున్నాం.

- శ్రీధర్ ఎంపీడీఓ, దామరగిద్ద

క్లుప్తంగా

గుంతలమయంగా బీటీరోడ్డు



ధన్వాడ: మండలంలోని కోయిల్‌సాగర్‌నుంచి గోటూర్ మీదుగా మరికల్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బీటీరోడ్డు కంకర తేలడంతో ఆర్టీసీ బస్సు సేవలను సైతం నిలిపివేశారు. దీంతో నిత్యం కళాశాల, పాఠశాల, ఉద్యోగలకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా గ్రామ దేవత బోనాలు

మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లి గ్రామ దేవత లక్ష్మమ్మవ్వ బోనాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బ్రహ్మంగారి నాటిక ప్రదర్శన



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో సోమవారం రాత్రి విరాట్ పోతులూరి వీరబ్రహ్మం జీవిత చరిత్రపై నాటిక ప్రదర్శనను కాంగ్రెస్ జిల్లా నాయకులు సూర్య మోహన్, మండల అధ్యక్షుడు వీరన్న ప్రారంభించారు. ఈ నాటిక ప్రదర్శన తిలకించేందుకు అధిక సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చి తిలకించ్చారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, కృష్ణయ్య, హరిష్, బాలచంద్రయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మాగనూర్: మండల ప్రాథమిక పాఠశాలలో పనిచేసే స్కూల్ స్వీపర్లు గత 9నెలలు గడుస్తున్న వేతనాలు రాలేదని జిల్లా స్వీపర్ల సంఘం అధ్యక్షుడు అమ్మపల్లి ఆంజనేయులు అన్నారు. ఒకవైపు చాలిచాలని జీతాలు ఇస్తున్న ప్రభుత్వాలు అవి కూడా నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు ఒకవారం రోజుల్లో వేయాలన్నారు. లేని పక్షంలో ధర్నా కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

బెల్లం పానకం పారబోత



మద్దూరు: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం మండలంలోని పల్లెగడ్డతాండా, మేడికుంట తాండాలోని పరిసర పొలాల్లో ముకుమ్మడి దాడులు నిర్వహించి సారాతయారికి ఉపయోగపడే బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఈ రెండు తాండాల్లో 1,125 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయగా, 8లీటర్ల సారాను పట్టుకున్నారు. అలాగే ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంలాల్ తెలిపారు. గ్రామాల్లో తాండాల్లో సారాయి తయారు చేసినా అమ్మినా, అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అవసరమైతే పీడీయాక్టు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో కోస్గి ఎస్ఐ-2 నరేష్, మద్దూరు ఎస్ఐ-2 శ్యాంసుందర్, ఎక్సైజ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

మక్తల్: మండలంలోని ముష్టిపల్లిలో తాగునీటి ఎద్దడి ఉండటంతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరువ తీసుకుని గ్రామానికి తాగునీటి బోరును మంజూరు చేయించారు. మంగళవారం బోరు వేయించడంతో పుష్కలంగా నీళ్లు వచ్చాయి. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డేది?

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్, అమ్మపల్లి, మందిపల్లి గ్రామాల సమీపంలోని పెద్దవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. ఇసుకాసురులు ప్రధాన కూడలిలో కొందరు కాపల కోసం ఉంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులు ఇటుగా దృష్టిసారించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నారాయణపేట రూరల్ : రాష్ట్రీయ కళామందిర్ సింగిడి - 2024 పేరుతో నిర్వహిస్తున్న విద్యార్థి సాంస్కృతిక పోటీల వాల్‌పోస్టర్‌ను మంగళవారం స్థానిక సీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో విడుదల చేశారు. ఈ నెల 20, 21తేదీలలో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ వేదికపై జరగనున్న కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఏబీవీపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, ఇంతియాజ్, వెంకటరమణ, వివేకానంద, సతీష్, లక్ష్మణ్, చరణ్‌రెడ్డి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

పాఠాలు బోధించిన విద్యార్థులు..

నారాయణపేట రూరల్ : మండలంలోని లక్ష్మిపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులే ఉపాధ్యాయులై స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కలెక్టర్‌గా శివారెడ్డి, డీఈఓగా నవీన్, హెచ్‌ఎంగా బిందు వ్యవహరించగా పలువురు టీచర్లుగా విధులు నిర్వహించారు. చక్కటి విద్యాబోధన చేసిన వారికి గ్రామపెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జనార్దన్‌రెడ్డి, టీచర్లు శ్రీనివాస్, సంధ్య, అక్షిత పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మంటలు ఆర్పివేసిన పారిశుద్ధ్య కార్మికులు

అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో టీ హోటల్‌కు చెందిన వ్యర్థాలను పారవేయడమే కాకుండా వాటిని తగులబెట్టడంతో మంటలు పక్కనున్న చెట్లకు వ్యాపించాయి. విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు వాటర్ ట్యాంకును తీసుకెళ్లి మంటలను ఆర్పేయడంతో పచ్చని చెట్లు అగ్నికి ఆహుతి కాకుండా నివారించగలిగారు. ప్రతినిత్యం చెత్త వాహనాలు వస్తున్నా కొంతమంది హోటల్ యాజమానులు, ఇంటి యాజమానులు హైస్కూల్ మైదానంలో చెత్తను పారవేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారి వివరాలను సేకరించి మున్సిపల్ ద్వారా జరిమానలు విధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ సిబ్బంది చిన్న తెలిపారు.



చెత్తను ఆర్పుతున్న మున్సిపల్ కార్మికుడు

‘తైబజారు’ సిబ్బందికే చెల్లించాలి

ఆత్మకూర్: మున్సిపాలిటీ తైబజారు రుసుమును కాంట్రాక్టర్‌కు కాకుండా మున్సిపల్ సిబ్బందికే చెల్లించాలని కమిషనర్ నాగరాజు వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో తైబజారు వేలం నిర్వహించలేకపోతున్నామని, మార్చి 31 నాటికే తైబజారు వసూళ్లకు సంబంధించి గుత్తేదారు కురుమూర్తి కాలపరిమితి ముగిసిందన్నారు. వ్యాపారుల నుంచి తైబజారు రుసుమును వసూలు చేసేందుకు సిబ్బందిని కేటాయించామని వారికే తైబజారు రుసుమును చెల్లించాలని కోరారు. అలాగే ఇంటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



కమిషనర్ నాగరాజు

వైభవంగా ఎల్లమ్మ బండారు మహోత్సవం

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రంలో బీరప్ప ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఎల్లమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆలయంలో కుర్వ కులస్తులు బండారు కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీఆర్ఎస్ నాయకులు దేవరి మల్లప్ప హాజరై ప్రత్యేక పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, మాజీ సర్పంచ్ చిన్నసాయిలుగౌడ్, ఎంపీటీసీ కిరణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు వీరారెడ్డి, కనకప్ప తదితరులు పాల్గొన్నారు.



భక్తులపై బండారు చల్లుతున్న రామ్మోహన్‌రెడ్డి

ఇష్టారాజ్యంగా ఒండ్రుమట్టి తరలింపు

ధన్వాడ: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మంగళవారం ఒండ్రు మట్టి తరలింపులో కొంతమంది గుత్తేదారులు ఇటుక బట్టీలకు అమ్మకాలు చేస్తున్నారు. రెవెన్యూ వారితో 30టిప్పర్లకు అనుమతి తీసుకుని 300టిప్పర్లు తరలిస్తున్నారు. అధికారులు అనుమతులు ఇచ్చిన తరువాత తరలించే సమయంలో పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కాని అనుమతులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇదే అదునుగా 15టిప్పర్లతో రెండు ఇటాచిలు ఏర్పాటు చేసి ఇటుక బట్టిలకు తరలిస్తున్నారు. గత మూడు రోజు కిందట మట్టి తరలించడంతో రైతులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో నిలిపివేశారు. ఇప్పుడు మళ్లీ తిరిగి తరలింపు ప్రారంభించారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా 30 ట్రిప్పులకు మాత్రమే అనుమతి ఇచ్చామని తెలిపారు. తమ పొలాలకు మట్టి వేసుకునేందుకు జేసీబీలను పెట్టాలని రైతులు కోరుతున్నారు.



చెరువులోనుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దామరగిద్ద: మండలంలోని మొగుల్‌మడ్క సబ్‌స్టేషన్ పరిధిలోని మొగుల్‌మడ్క ఫీడర్ పరిధిలోని మొగుల్‌మడ్క, విఠలపూర్, గత్స, అన్నసాగర్, నర్సాపూర్, సుద్దబండతాండ గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. విద్యుత్‌లైన్ పొడవున చెట్లకొమ్మలను తొలగిస్తున్నందున మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. రైతులు గమనించి ముందస్తుగా తమ వ్యవసాయ ఇతర విద్యుత్ అవసరాలను తీర్చుకొని విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజీనామా

మద్దూరు: బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మద్దూరు ఎంపీటీసీ-2 సిపిరి వెంకటయ్య బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి, మండల పార్టీ అధ్యక్ష పదవీకి రాజీనామా చేసినట్లు మంగళవారం తెలిపారు. మూడు ఏళ్లుగా మండల అధ్యక్షుడిగా పనిచేసినా పార్టీ నాయకత్వం గుర్తించడం లేదన్నారు. మనస్తాపంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టర్ ఆదేశించినా ఫలితం శూన్యం



అమరచింత: పట్టణ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వల్ల 132 విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు చేనేత ఉత్పత్తుల సంఘంలో పనిచేస్తున్న కార్మికులకు దుర్వాసన వస్తుందని, వీటిని వెంటనే తొలగించాలని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించినా ఇప్పటి వరకు వాటిని తరలించలేకపోయారు. అప్పటి కలెక్టర్లు శ్వేతామహంతి, షేక్‌యాస్మీన్‌బాషా సైతం ఇక్కడి నుంచి డంపింగ్ యార్డును తరలించాలని ఆదేశాలు జారీచేసినా ఫలితం లేదు. తాజాగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ చెప్పినా మున్సిపల్ పాలకవర్గంతో పాటు కమిషనర్ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిని తొలగించాలని కోరుతున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కోస్గి: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం వంటిదని, ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని సీఐ సోమ నర్సయ్య సూచించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని సమస్యాత్మకమైన చంద్రవంచ, కొత్తపల్లి గ్రామాల్లో పోలీసులు, కేంద్ర ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పోలీసుశాఖ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తుందని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీసుశాఖ లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ శేఖర్‌గౌడ్‌తోపాటు ఆర్ఎఎఫ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

ఉగాది పురస్కారాల కరపత్రాలు విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న శాంతానంద్‌పురోహిత్

నారాయణపేట రూరల్ : పట్టణంలోని సంత్‌మత్ మూల మహాసంస్థానం ఆధ్వర్యంలో తెలుగు నూతన సంవత్సరానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం శక్తిపీఠంలో విడుదల చేశారు. ఏటా ప్రధానం చేసే ఉగాది పురస్కారాలకు సంబంధించిన వివరాలను శక్తిపీఠం వ్యవస్థాపకులు శాంతానంద్ పురోహిత్ వెల్లడించారు. ఈ నెల 9న శక్తిపీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పంచాగ శ్రవణ కార్యక్రమం ఏర్పాటుచేస్తామన్నారు. అనంతరం పచ్చడి వితరణ కార్యక్రమం ఉంటుందని, ఈ సందర్భంగా ఉగాది పురస్కారాలను అందిస్తామన్నారు. మరికల్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది లక్కాకుల అయ్యప్ప, నారాయణపేటకు చెందిన ఆధ్యాత్మిక వేత్త సూగురప్ప, ఊట్కూర్‌కు చెందిన విద్యావేత్త, జీహెచ్‌ఎం రమేష్‌శెట్టి, వ్యాపారవేత్త రవికుమార్‌గౌడ్, న్యాయవాది రఘువీర్‌యాదవ్‌లకు పురస్కారాలు అందిస్తామన్నారు.కమిటీ సభ్యులు యాద్గీర్‌నారాయణరెడ్డి, డాక్టర్ మధన్‌మోహన్‌రెడ్డి, రాములు, మురళీధర్, సుధబూకర్, రాజశేఖర్, లింగం పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద వసతులు కల్పించండి

అమరచింత: పట్టణంలోని ఈద్గా వద్ద పవిత్ర రంజాన్ నమాజు కోసం వస్తున్న భక్తులకు వసతులు కల్పించాలని జామీయా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈద్గా ప్రాంగణం ముళ్లపొదలతో నిండుకుందని, వాటిని శుభ్రపర్చడంతో పాటు నీటి వసతిని ఏర్పాటు చేయాలని కోరారు. పవిత్ర పార్థన కోసం వస్తున్న ముస్లిం మైనార్టీల కోసం నీడ సౌకర్యం కల్పించాలన్నారు. రంజాన్ సందర్భంగా ఈద్గా వద్ద సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అన్సారీ, తౌఫిక్, అస్సు తదితరులు పాల్గొన్నారు.



చెర్‌పర్సన్‌కు వినతిపత్రం అందిస్తున్న మసీద్ కమిటీ సభ్యులు

కురుమ యాదవులకు న్యాయం చేయాలి

పాలమూరు: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కురుమ యాదవుల నుంచి వసూలుచేసిన గొర్రెల యూనిట్ల డీడీలను వడ్డీతో సహా చెల్లించి, న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం కలెక్టర్ జి.రవి నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బీజేపీ నేత కె.రాములుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 16వేల మంది గొర్రెల పథకానికి దరఖాస్తు చేసుకోగా.. కేవలం 1,377 మందికి మాత్రమే పంపిణీ చేశారన్నారు. మిగిలిన వారు రెండేళ్లుగా చెల్లించిన డీడీల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఒక్కో యూనిట్ కింద లబ్ధిదారు వాటాగా రూ.47 వేలు చెల్లించారని.. మొత్తం రూ.48 కోట్ల వరకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని తెలిపారు.

- మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణపై కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేస్తే, సహించేదిలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇప్పటికైనా పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలని సూచించారు.
- మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల బీజేపీ స్పోక్ పర్సన్స్‌గా రాములు, కొండా ప్రశాంత్‌రెడ్డి, బాలవర్ధన్‌గౌడ్, మెట్టుకాడి శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డిలను నియమించారు.
- పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ పార్లమెంట్ ప్రభారి నరేందర్‌రెడ్డి కోరారు. అన్నారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాలమూరు పట్టణశక్తి కేంద్ర ఇన్‌చార్జీల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పద్మజారెడ్డి, బాలరాజు, కృష్ణవర్ధన్‌రెడ్డి, సత్యం, పాండురంగారెడ్డి, అంజయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ఆత్మకూర్: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో సీఐ కేఎస్ శివకుమార్, ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక గాంధీచౌక్, చెరువుకట్ట వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు, డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. వాహనాల్లో నగదు తరలింపు, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. నగదుకు సంబంధించిన పూర్తి ధృవపత్రాలు ఉండాలని సూచించారు.



వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పేటలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



రెనివట్ల పాఠశాలలో..



మరికల్‌లో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

నారాయణపేట రూరల్ : పట్టణంలోని ఏయిడేడ్ దయానంద్ విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఎన్ఐడీడీసీపీ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 6నుంచి 12 సంవత్సరాలలోపు చిన్నారుల్లో అయోడిన్‌లోపం, గాయిటర్‌వ్యాధి నిర్ధారణపై పరీక్షలు చేశారు. 90మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కే.నారాయణ, టీచర్లు రాంచరణ్, గోపాల్‌గౌడ్, వైద్యబృందం పుష్ప, సరస్వతి, రామేశ్వరి, పుష్పలత పాల్గొన్నారు.

కోస్గి: గుండుమాల్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఉచితంగా థైరాయిడ్ పరీక్షలు నిర్వహించారు. వైద్య బృందం ప్రతినిధులు నాలుగు గ్రూపులుగా ఏర్పడి మండల పరిధిలోని పలు గ్రామాల్లో 6, 7వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు అయోడిన్, సాల్ట్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి కిష్టమ్మ ఆధ్వర్యంలో మొత్తం 360మంది విద్యార్థులకు పరీక్షలు చేసినట్లు వైద్య బృందం తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు నర్సింహారెడ్డి, హరికారెడ్డి, సిబ్బంది రాంచందర్‌జీ మణిమాలతో పాటు ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని రెనివట్ల బాలికల ప్రాథమిక పాఠశాలలో ఎన్ఐడీడీఏపీలో భాగంగా మంగళవారం విద్యార్థులకు డాక్టర్ రోహిణి పరీక్షలు చేశారు. విద్యార్థులలో ఉప్పునుశాతం, యూరిన్ టెస్ట్ నిర్వహించారు. దాదాపు 90మంది విద్యార్థులకు పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఎస్తర్, హెచ్‌ఎస్ ప్రేమమ్మ, ఏఎన్‌ఎంలు హెచ్‌ఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంతోపాటు మాధవరంలో మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించిన వైద్యులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులను అందజేశారు. ఆస్పత్రి సిబ్బంది బస్వరాజ్, అరవింద్‌తోపాటు ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని హిందుపూర్, ముడుమాల్ గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు మంగళవారం వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ ఫిరోజ, డాక్టర్ రాణి తేజశ్వని మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులకు అవసరమైన మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైద్యసిబ్బంది అలివేలమ్మ, వేదవతి, రజిని, వరలక్ష్మీ, ఆశావర్కర్లు పద్మ, నందిని, నరసమ్మ, సుమిత్ర, మహదేవమ్మ, హెచ్‌ఎం అజయ్, జ్యోతి, మీర, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని కొల్లూరు పాఠశాల, ఊట్కూరులో ఉర్దూమీడియం పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు.. డా బాలాజిరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అయోడిన్ లోపంతో వచ్చే రుగ్మతలగురించి వివరించారు. వైద్యసిబ్బంది మణిమాల, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో..